క్లుప్తంగా

వధూవరులకు ఆశీర్వాదం

విడవలూరు: విడవలూరు గ్రామానికి చెందిన కుడుముల జగదీష్ – మాధవీలత కుమార్తె నిహారిక – పవన్ పృథ్వీల వివాహం స్థానిక సాయిబాబా కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

• **బుచ్చిరెడ్డిపాళెం :** బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన వింజమూరు వెంకటేశ్వర్లు– పద్మావతిల కుమారుడు మనోజ్‌కుమార్– లక్ష్మీశోభల కల్యాణం జొన్నవాడలోని కామాక్షితాయి ఆలయంలో ఆదివారం జరగ్గా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. పార్టీ మండలాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి, నగర పంచాయతీ అధ్యక్షుడు షాహుల్, పార్టీ నేతలు కలువ బాలశంకర్‌రెడ్డి ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి కూడా హాజరై ఆశీర్వదించారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



మనుబోలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మనుబోలు: మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఫణీంద్ర శర్మ అమ్మవార్లకు పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకాలంకరణ అనంతరం విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో ప్రజలు గ్రామదేవతలను దర్శించుకున్నారు. కార్యక్రమాలకు ఎంపీటీసీ దువ్వూరు రాజేశ్వరమ్మ, సుధాకర్‌రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

అంకమ్మ తల్లికి..



విడవలూరు: విడవలూరు గ్రామదేవత అంకమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకుడు కొర్నా గిరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. మడపర్తి వేణుగోపాల్–మంజుల దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వేములమ్మకు..



బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని మినగల్లు గ్రామంలో వేములమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. తొలుత గ్రామ పురవీధుల్లో ఊరేగింపు వేడుకగా సాగింది. అనంతరం భక్తులు అమ్మవారికి సలిపిండి, పానకాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు.

అంకాళ పరమేశ్వరికి..



విశేషాలంకరణలో అమ్మవారు

రాపూరు: మండలంలోని వేపినాపి సమీపంలో పోతుకొండలో ఉన్న అంకాళ పరమేశ్వరికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం అభిషేకం, ప్రత్యేక పుష్పాలతో పూలంగిసేవ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి తలనీలాలు సమర్పించి పొంగళ్లు పెట్టారు.

వేడుకగా ఏకాంత సేవ

కొడవలూరు: గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో స్వామి అమ్మవార్లకు ఏకాంత సేవ ఆదివారం రాత్రి వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లు దర్బారు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు బండారు సుబ్రహ్మణ్యం స్వామివార్లకు పూజలు చేశారు. ఆలయ చైర్మన్ ఆలం మాలకొండయ్య, ఈఓ బండి శాంతయ్య పర్యవేక్షించారు.

నకిలీ సీడ్‌తో విలవిల

వెనామీకి గడ్డుకాలం

• రూ.కోట్లలో నష్టాలు
• ఆందోళనలో ఆక్వా రైతులు



రొయ్యల్ని పట్టేస్తున్న దృశ్యం

ముత్తుకూరు: వెనామీ రొయ్యల పెంపకానికి గడ్డుకాలం ఎదురైంది. ఓ వైపు వైరస్ వ్యాప్తితో చెరువుల్లో రొయ్యలు నిర్జీవమవుతుండగా, మరో వైపు నకిలీ సీడ్‌తో ఎదుగుదల కోల్పోయి రైతులకు నష్టాలను మిగిలిస్తున్నాయి. ముత్తుకూరు మండలంలో 1950 ఎకరాల్లో వెనామీని సాగు చేస్తున్నారు. రొయ్యల పెంపకంలో పొట్టెంపాడు, పోలంరాజుగుంట గ్రామాలు ముందు వరుసలో ఉన్నాయి. వైరస్ వ్యాప్తితో పొట్టెంపాడులోని చెరువుల్లో రొయ్యలు నిర్జీవమై రైతులను కలవరపెడుతున్నాయి. రేబాలలోని ఓ హేచరీ నుంచి కొనుగోలు చేసి తెచ్చిన నకిలీ సీడ్‌తో పోలంరాజుగుంటలో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

లక్షల సంఖ్యలో..

అనుమతుల్లేని హేచరీ నిర్వాహకులపై నమ్మకంతో రొయ్య పిల్లను 30 పైసల చొప్పున కొనుగోలు చేసి చెరువుల్లో లక్షల సంఖ్యలో వదిలారు. 68 రోజుల వ్యవధిలో 80 నుంచి 100 కౌంట్ వరకు రొయ్యలు పెరగాల్సి ఉంటుంది. అయితే 275 కౌంట్‌కే పరిమితమవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. పోలంరాజుగుంట, నిడిగుంటపాళేనికి చెందిన సుమారు 15 మందికిపైగా రైతులు నక్కలకాలువ ఒడ్డున 120 ఎకరాల్లో పెంచిన రొయ్యలు ఎదుగుదల కోల్పోయాయి. సుమారు రూ.రెండు కోట్ల మేర రైతులు నష్టపోయారు. సీడ్ ఖర్చుతో పాటు మందులు, మేత, విద్యుత్ బిల్లులు పెరగడం తప్ప రొయ్యల ఎదుగుదల లేకపోవడంతో కన్నీటి పర్యంతమయ్యారు. చెరువుల్లోని వీటిని విధిలేక నెల్లూరు మార్కెట్‌కు తరలించాల్సిన దుస్థితి ఏర్పడింది. మిగిలిన రైతులు ఎలాంటి ఫలితాలొస్తాయోనని ఎదురుచూస్తున్నారు.



ఎదుగుదల లేని రొయ్యలను చూపిస్తూ.. (ఫైల్)



ఎదుగుదలలో హెచ్చుతగ్గులు

ఆదుకోవాలి



నకిలీ సీడ్‌తో తీవ్రంగా నష్టపోయిన రైతులను ఉన్నతాధికారులు ఆదుకోవాలి. కొనుగోలుకు చెల్లించిన డబ్బును హేచరీ నిర్వాహకుల నుంచి తిరిగి ఇప్పించాలి. రైతులు మరోసారి నష్టపోకుండా సంబంధిత హేచరీపై తగు చర్యలు చేపట్టాలి. – **దువ్వూరు కోదండరామరెడ్డి, ఆక్వా రైతు**

అధికారులు న్యాయం చేయాలి



నకిలీ సీడ్‌తో రూ.లక్షల్లో నష్టపోయిన విషయాన్ని మత్స్యశాఖ అధికారులకు తెలియజేశాం. హేచరీ నిర్వాహకులు చేసిన మోసాన్ని వివరించాం. అధికారులు న్యాయం చేయాలి.
– **విజయసేనారెడ్డి, ఆక్వా రైతు**

నేత్రపర్వం.. రథోత్సవం



రథంలో స్వామి, అమ్మవార్లు



వేడుకగా సాగుతున్న రథోత్సవం



తరలివచ్చిన భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి పట్టణంలోని రామకృష్ణనగర్‌లో వెలసిన వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్ల రథోత్సవం ఆదివారం వేలాది మంది భక్తుల నడుమ గోవిందనామ స్మరణ మధ్య వేడుకగా సాగింది. తొలుత శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామిని ప్రత్యేక రథంపై కొలువుదీర్చారు. ప్రత్యేక పూజలనంతరం ఉదయం 9.50 గంటలకు రథోత్సవం మొదట చెన్నూరు రోడ్డు మీదుగా వైఎస్సార్ కూడలి వరకు సాగి తిరిగి చెన్నూరు రోడ్డు మీదుగానే కొత్త బస్టాండుకు చేరుకుంది. రథోత్సవానికి ముందు భారీ ఎత్తున ఆధ్యాత్మిక పాటలు, భజనలతో భక్తులు సాగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

అశ్వవాహనంపై ఊరేగింపు

రథోత్సవం అనంతరం రాత్రి అశ్వవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా స్వామివార్లకు సోమవారం చక్రస్నానం నిర్వహించనున్నారు.

తోటల్లోనే నిమ్మకాయలు



మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయలు (ఫైల్)

పొదలకూరు: ఈ ప్రాంతంలో నిమ్మ సాగు అధికంగా ఉంది. ప్రస్తుతం కాయలు కోయకుండా రైతులు నష్టపోతున్నారు. ధరలుంటే పిందెలను కోసి మార్కెట్‌కు పంపడం.. ధరలు పెరుగుతాయనే సమాచారం ఉంటే తోటల్లోనే కాయలను ఉంచుకోవడం అలవాటుగా మారింది. దీంతో సకాలంలో కోతకు వచ్చిన కాయలను మార్కెట్‌కు తరలించకుండా నష్టాలను చవిచూస్తున్నారు. మార్చి నెలలో ధరలు పెరుగుతాయని రైతులు భావించి కోతకు వచ్చిన కాయలను కూడా తోటల్లోనే ఉంచారు. ఫలితంగా పండిపోయి రాలిపోతున్నట్టుగా తెలుస్తోంది. ఇందువల్ల మార్కెట్‌కు సైతం కాయలు ఆశించిన స్థాయిలో పంపుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతి నుంచి రైతులు తోటల్లో కాయలను సక్రమంగా కోయకుండా ఉంచారు. దీంతో గ్రీన్ కలర్ (పచ్చివి) కాయలు ఎల్లో కలర్ (పండువి)గా మారడంతో ఎగుమతులకు పనికిరాక వ్యాపారులు ఆశించిన స్థాయిలో ధరలను చెల్లించలేకపోతున్నారు. ఈ తంతు ప్రతి ఏడాది జరుగుతున్నా రైతులు గుర్తించలేకపోతున్నట్టు తెలుస్తోంది. పచ్చికాయలు పండ్లుగా మారుతున్న సమయంలో మార్కెట్‌కు హడావుడిగా తరలిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో నిమ్మకాయలు ఒక కిలో రూ.40 నుంచి రూ.60 వరకు ఉంది. గతేడాది టాప్ ధర కిలో రూ.80 వరకు పలికింది. సాధారణంగా నిమ్మ దిగుబడి మార్చి, ఏప్రిల్ నెలల్లో అధికంగా ఉంటే రైతులకు ధరలు లభించి ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. ఈ పరిస్థితి అన్ని తోటల్లో ఉండకపోగా కొందరు రైతులకు ధరలున్న సమయంలో దిగుబడి కూడా ఉండదు. కోతకు వచ్చిన కాయలను మార్కెట్‌కు తరలిస్తే ఉన్న ధరలైనా దక్కుతాయని తోటల్లో ఉంచుకోవడం వల్ల రాలిపోయే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మార్చి ప్రారంభంలో ధరలు తక్కువగానే ఉన్నాయి.

కూటమి పాలనలో ప్రజలకు అన్యాయం



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి

• మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: 'కూటమి పాలనలో తెలుగు తమ్ముళ్లకే లబ్ధి చేకూరుతోంది. సామాన్య ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది' అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వరిగొండ జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో ఆదివారం జరిగిన స్థానిక నాయకుడి తనయుడు ఈగా కార్తీక్ – పొట్టూరి సింధూజ వివాహానికి కాకాణి హాజరై వారిని ఆశీర్వదించారు. తర్వాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాంగణంలో నూతనంగా ప్రతిష్ఠించిన నాగేంద్రుని శిలలను దర్శించుకున్నారు. అనంతరం గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు అన్ని విధాలా మేలు జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి నెలకు రూ.3,000 ఇస్తామని హామీ ఇచ్చి బడ్జెట్‌లో ఆ ఊసే లేకుండా మోసం చేశారన్నారు. ఆడబిడ్డ నిధి నెలకు రూ.1,500లు ఇస్తామని ఇంత వరకు నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. ఉచిత బస్సు ప్రయాణం మహిళలు ఎదురు చూస్తున్న పరిస్థితి ఉందన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవకు అరకొరగా నిధులను కేటాయించడం చూస్తుంటే అర్హత కలిగిన లబ్ధిదారులను పక్కన పెట్టనున్నట్లు స్పష్టమైందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులకు ఏ పని చేయరాదంటూ మాట్లాడిన చంద్రబాబు ముఖ్యమంత్రి పదవికి ఎంత మాత్రం అర్హుడు కాదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రాజకీయాలకు అతీతంగా, పార్టీల ప్రమేయం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందించిన విధానాన్ని ఇప్పుడు ప్రజలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఎవరికి ఏ అన్యాయం జరిగినా పోరాటానికి సిద్ధమన్నారు. అన్యాయం చేసిన వారిని వదిలిపెట్టబోమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, కామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లిపూడి సునీల్‌రెడ్డి, కోటా శేఖర్‌రెడ్డి, చెరుకూరు శ్రీనివాసులునాయుడు, గండవరపు శ్యామలమ్మ, ఒబ్బారెడ్డి సురేష్‌రెడ్డి, కోసూరు రవీంద్రయ్య, గండవరపు వెంకటసుబ్బారెడ్డి, జానా శ్రీనివాసులు, జానా శేషు, స్థానిక సర్పంచ్ ఈగా సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నను కలిసిన మండల నాయకులు



చలపతిరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావుకు మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదివారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరులోని ప్రసన్న నివాసంలో ఈ మేరకు సత్కరించారు. జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, విడవలూరు మండలాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, కొడవలూరు మండలాధ్యక్షుడు చిమటా శేషగిరి, పార్టీ నేతలు కలువ బాలశంకర్‌రెడ్డి, దేవిరెడ్డి సాయిరెడ్డి ఉన్నారు. అలాగే పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు ప్రసన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిలో పార్టీ నేతలు నిరంజన్‌బాబురెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, అనూప్‌రెడ్డి, శ్రీలత, నరసింహులురెడ్డి, వెంకటరమణరెడ్డి, పుచ్చలపల్లి వెంకటరమణరెడ్డి, ప్రసాద్, గయాజ్ ఉన్నారు.

• **విడవలూరు:** వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల మండలాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నను ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ను కలిసిన వారిలో రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, నాశిన రాజశేఖర్ (యూత్ వింగ్), వయ్యాల శేషమ్మ(మహిళా విభాగం), శీలు రవి (రైతు విభాగం), నిమ్మల శివయ్య(బీసీ సెల్), కాగొల్లు చిన్న మస్తానయ్య(ఎస్సీ సెల్), చౌటూరు రమణమ్మ (ఎస్టీ సెల్), షేక్ బాబులు (మైనారిటీ సెల్), భక్తాని నవీన్ (స్టూడెంట్ వింగ్), దాసరి కరుణాకర్ (వైఎస్సార్‌టీయూసీ), పంచమూర్తి నారాయణ (వీవర్స్ వింగ్), పొన్నాల కృష్ణారెడ్డి (పంచాయతీరాజ్), గుబ్బ రాధాకృష్ణ (వాణిజ్య విభాగం), కూనాసి విజయ భాస్కర్ (క్రిస్టియన్ మైనార్టీ సెల్), కూనాసి జయప్రకాష్ (పబ్లిసిటీ వింగ్) పాల్గొన్నారు.



ప్రసన్నతో కోవూరు నాయకులు

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



నిర్మానుష్యంగా గేటుసెంటర్

పొదలకూరు: పొదలకూరు ప్రాంతంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. గతేడాది కంటే అధికంగా ఈసారి ఎండలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. మార్చి ప్రారంభంలోనే భానుడి భగభగలు మొదలయ్యాయి. ఈ ప్రాంతానికి వెలిగొండలు దగ్గరగా ఉండడం, మెట్ట ప్రాంతమైనందున ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఒకటి, రెండు డిగ్రీలు అదనంగా ఉంటున్నాయి.

ఘనంగా యోగా కేంద్ర వార్షికోత్సవం

పొదలకూరు: పట్టణంలోని శ్రీనిర్మలానంద నిత్య యోగా సాధన కేంద్రం 10వ వార్షికోత్సవాన్ని ఆదివారం యోగా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యోగా గురువు నిర్మలానందస్వామి హాజరయ్యారు. యోగా కేంద్రంలో భక్తిశ్రద్ధలతో హోమం నిర్వహించారు. యోగా వల్ల ఉపయోగాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో స్థానిక యోగా గురువు చింతక్రింత పెంచలయ్య, లక్కాకుల ఆనంద్‌రావు, కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా..



ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్లో ఇలా..



పీఆర్ గుంట పాఠశాలలో..

ముత్తుకూరు: విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం కొన్ని సంవత్సరాల ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఈ–టాయిలెట్స్ ప్రస్తుతం అలంకారప్రాయంగా మారాయి. ఓ ప్రైవేట్ సంస్థతో అప్పట్లో కుదుర్చుకొన్న ఒప్పందం ప్రకారం విద్యాశాఖ అధికారుల అనుమతి, ప్రమేయం లేకుండా పాఠశాలల్లో వాటిని పెట్టారు. అయితే నీటి సౌకర్యం కల్పించలేదు. దీంతో అవి దిష్టిబొమ్మల్లా మారాయి.